కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 20, దొండ 23, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 26, చామగడ్డ 28, మొరంగడ్డ 18, కందగడ్డ 85, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

బానోతు నరేష్‌కు ఫిజిక్స్‌లో డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: గిరిజన విద్యార్థి బానోతు నరేష్‌కు ఓయూ ఫిజిక్స్ పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. సైన్స్ కాలేజీ ఫిజిక్స్ అధ్యాపకులు ప్రొ.లక్ష్మణ్ నాయక్ పర్యవేక్షణలో ఆయన చేసిన పరిశోధనకు డాక్టర్ డిగ్రీ లభించిందని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పర్కలజాల తండాకు చెందిన బానోతు నరేష్ తన పరిశోధన గ్రంథాన్ని గైడ్ ప్రొ.లక్ష్మణ్ నాయక్‌కు అందచేశారు.

సుందర్ నగర్ అధ్యక్షుడిగా కంజర్ల అమర్నాథ్



సుందర్‌నగర్ నూతన కార్యవర్గం..

సనత్‌నగర్: సుందర్‌నగర్ రెసిడెంట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అమర్నాథ్ కంజర్ల ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా విజయకుమార్, కోశాధికారిగా జీబీజీ తిలక్, కార్యవర్గ సభ్యులుగా నరేందర్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అమర్నాథ్ కంజర్ల మాట్లాడుతూ కాలనీ ప్రజలతో నిరంతరం మమేకమై సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు సీతాఫల్‌మండి డివిజన్ బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు సమాయత్తం కావాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ కోరారు. సోమవారం సీతాఫల్‌మండి డివిజన్ బీఆర్‌ఎస్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు చేరవేయాలని ఆమె చెప్పారు. సీతాఫల్‌మండి డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లో వరంగల్ సభరోజు ఉదయం పార్టీ జెండాలు ఎగురవేసి కార్యకర్తలు భారీ ర్యాలీలతో బయలుదేరాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

26న ఓయూ ఫౌండేషన్ డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫౌండేషన్ డేను ఈ నెల 26న నిర్వహించనున్నారు. నిజాం పాలనలో 1917లో స్థాపించిన ఓయూ 108 ఏండ్లు ముగించుకొని 109వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఫౌండేషన్ డేను క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో అధికారికంగా జరపనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓయూ పూర్వవిద్యార్థి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు హాజరుకానున్నట్లు సమాచారం.

హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

హిమాయత్‌నగర్ : దేశంలో పనిచేస్తున్న 5 లక్షల పైచిలుకు హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించే విధంగా హోంగార్డు 1946–47, 1962, 63 చట్టాలు సవరించి, రాష్ట్రంలో నిలిపివేసిన కారుణ్య నియామకాలను అమలు చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రికి సిఫార్సు చేయాలని కోరుతూ హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల అశోక్ కేంద్రమంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా విపత్తులో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోలీసులతో సమానంగా పనిచేశామన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేకపోవడంతో అనారోగ్యంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వినతి ఇచ్చిన వారిలో ప్రకాష్, కిరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకుల అరెస్ట్

పాలనా భవనం ఎదుట బైఠాయించి ఆందోళన



నిరవధిక సమ్మెలో పాల్గొన్న ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని నిరవధిక సమ్మె చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పాలనా భవనం ఎదుట బైఠాయించి నినాదాలతో సమ్మె చేస్తున్న అధ్యాపకులను పోలీసులు అడ్డుకున్నారు.

సమ్మెను విరమించాలని పోలీసులు కోరినా అధ్యాపకులు కొనసాగించారు. దీంతో పోలీసులు కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ నాయకులు డా.వేల్పుల కుమార్, డా.మహేశ్వర్ రెడ్డి, డా.ఉపేందర్, సీమర్ల విజేందర్ రెడ్డి, డా.తాళ్లపల్లి వెంకటేశం, డా.కృష్ణయ్య, డా.కవితషిండే, డా.రేష్మారెడ్డి, డా.నస్రీన్ సుల్తానా, డా. చెన్నగౌడ్, డా.సనత్, డా.కృష్ణవేణి, డా.జయశ్రీ,డా.ప్రసాద్ తదితరులతో పాటు పలువురిని అరెస్ట్ చేసి ఓయూ పీఎస్‌కు తరలించారు.

ఓయూ వీసీ ప్రొ.కుమార్ పక్షపాత ధోరణి

ఓయూ వీసీ ప్రొ.కుమార్ కాంట్రాక్టు అధ్యాపకుల పట్ల పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని జేఏసీ నాయకుడు డా.ఉపేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగాల పర్మనెంట్ సానుకూలంగా ఉన్నా వీసీలు వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. పర్మనెంట్ అధ్యాపకులు ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 65 సంవత్సరాలకు పెంపు, పీఆర్‌సీ అమలు, పాత పింఛన్ విధానం కోసం పోరాడి సాధించుకున్నారని కాంట్రాక్టు అధ్యాపకుల హక్కుల కోసం ఆందోళన చేస్తుంటే అరెస్టు చేయిస్తున్నారని వీసీ కుమార్ పై ధ్వజమెత్తారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: ట్రాఫిక్ నియమాలను పాటించి బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేట కంట్రీక్లబ్ పక్కన ఉన్న ప్రెస్టీజ్ ఫీనిక్స్ బిల్డింగ్ మూడో అంతస్తులో ఉన్న డిజిట్ ఇన్సూరెన్స్ కంపెనీలో సోమవారం నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు.. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా కలిగే ప్రయోజనాలను, పాటించకపోతే కలిగే అనర్థాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. హెల్మెట్, సీటుబెల్టు ధరించడం, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్ వాడకూడదని, మద్యం సేవించి వాహనం నడపడం ఎంత ప్రమాదకరమో, లైన్ డిసిప్లిన్ పాటించాల్సిన అవసరం వంటి ముఖ్య విషయాలను వివరించారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుంది



సమావేశంలో మాట్లాడుతున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: ఈ నెల 27వ తేదీన వరంగల్ జిల్లాలో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బస్తీ, ప్రతి కాలనీ నుంచి పెద్ద సంఖ్యలో సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం కోసం కేసీఆర్ ప్రాణ త్యాగానికి సైతం సిద్ధపడిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీ ఏర్పాటు చేసి 25 వసంతాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 27న అన్ని డివిజన్‌లలో పార్టీ జెండాలను ఎగురవేయాలన్నారు. సమావేశంలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, శ్రీహరి, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు పాల్గొన్నారు.

ఏడోవార్డులో కమ్యూనిటీ హాళ్లు నిర్మించండి



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేత మురళీ ముదిరాజ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఏడోవార్డులో పేదలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని స్థానిక కాంగ్రెస్ నేత మురళీ ముదిరాజ్, ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను కలిసిన ఆయన సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. లాల్‌బజార్‌లోని గాంధీ కమ్యూనిటీ హాలును డంపింగ్ యార్డుగా మార్చడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించి, కమ్యూనిటీ హాలును పునరుద్ధరించాలని కోరారు. అలాగే లాల్ బజార్, తిరుమలగిరిలో మల్టిపర్పస్ ఫంక్షన్ హాల్స్ నిర్మించాలన్నారు.

యువ క్రీడాకారులకు అండగా ఉంటాం



క్రీడాకారులను అభినందిస్తున్న కొత్తపల్లి అర్జున్ పటేల్ తదితరులు

అమీర్‌పేట: యువ క్రీడాకారులకు అండగా ఉంటూ ప్రోత్సహిస్తామని ఏషియన్ గూమ్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్, సాయిబాబానగర్ అధ్యక్షుడు కొత్తపల్లి అర్జున్ పటేల్ గౌడ్ అన్నారు. తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్–2025 సబ్ జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించిన వాసు, వైశాలిరెడ్డిలను అభినందించారు.

ఇరువురు క్రీడాకారులకు నగదు బహుమతిగా అందించి సత్కరించారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఛాంపియన్ షిప్ నిర్వాహకులు కె.దయానంద్‌రెడ్డి, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మిస్‌గ్రాండ్ ఇండియా తెలంగాణ ఆడిషన్స్



ఆడిషన్స్‌లో పాల్గొన్న మోడల్స్

సనత్‌నగర్: మిస్ గ్రాండ్ ఇండియా తెలంగాణ 2025 ఆడిషన్స్ బేగంపేటలోని కంట్రీక్లబ్‌లో సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఇలాహే మోడలింగ్ అండ్ ఫినిషింగ్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో అందాల భామలు ర్యాంప్‌పై వయ్యారాలు ఒలకబోశారు. దాదాపు 100 మంది ఈ ఆడిషన్స్‌లో పోటీపడగా ప్రముఖ జడ్జింగ్ ప్యానెల్ ద్వారా భారతి బెరీ, ఊర్మిళ చౌహాన్ (ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ 2023) టాప్–5లో దక్కించుకున్నారు. వీరు ఏప్రిల్‌లో ఢిల్లీలో జరిగే మిస్ గ్రాండ్ ఇండియా ఫైనల్ ఆడిషన్లలో తెలంగాణ నుంచి హాజరు కానున్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

వెంగళరావునగర్: ఫిట్స్‌తో కిందపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ మృతిచెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో నివసించే సయ్యద్ ఖాదర్(41) ఈనెల 11వ తేదీ ఆటో డ్రైవింగ్‌కు వెళ్లాడు. రాత్రి ఖాదర్ సోదరుడు ఆయూబ్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఖాదర్ రహమత్‌నగర్‌లో ఫిట్స్ వచ్చి పడిపోయాడని తెలియజేశారు. దాంతో ఖాదర్ భార్య కుటుంబ సభ్యులు అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. మరోసారి ఫిట్స్ రావడంతో 13వ తేదీన ఓజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య మేరాజ్ బేగం ఫిర్యాదు మేరకు సోమవారం మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళి



పోప్ ఫ్రాన్సిస్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న హోలీ ట్రినిటీ చర్చి సభ్యులు

సనత్‌నగర్: పోప్ ఫ్రాన్సిస్‌కు బేగంపేట చీకోటి గార్డెన్స్‌లోని హోలీ ట్రినిటీ చర్చి సభ్యులు సోమవారం శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఫాదర్ జ్ఞానప్రకాష్, దైవజనులు హోసీటోచర్, మార్క్స్‌ఫ్రాన్సిస్, ఎడ్వర్డ్, మారియో డియాస్, మేరీ డియాస్, సింధు జోసెఫ్, లీనా జాకోబ్, సదానంద్, విలియన్ పిళ్లై తదితరులు ప్రార్థనలు నిర్వహించారు.

బీజేపీ నేతల సమావేశం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం పార్టీ డివిజన్ అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా మహంకాళి జిల్లా కార్యదర్శి రామ్ రెడ్డి హాజరయ్యారు. డివిజన్‌కు సంబంధించి మోర్చాల కమిటీలను ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్య నేతల పేర్లను రామిరెడ్డికి అందజేసినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు నేతి నారాయణ. మద్దెర్ల శ్యామ్ సుందర్. దత్తు. వి.ఎస్. రాజు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీల అక్రమాలను అరికట్టండి



వినతిపత్రం అందజేస్తున్న పృథ్వీతేజ

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల అక్రమాలను అరికట్టాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ ద్వారా ఆన్‌లైన్ అడ్మిషన్లు చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసులు చేస్తున్న కాలేజీల పై చర్యలు తీసుకోవాలని, అనుమతి లేని కాలేజీలను మూసివేయాలని, ముందస్తు తరగతుల నిర్వహణను అరికట్టాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి కృష్ణ ఆదిత్యకు వినతి పత్రం సమర్పించినట్లు ఏబీవీపీ నగర కార్యదర్శి పృథ్వీ తేజ తెలిపారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు

రసూల్‌పురా: రసూల్‌పురా సీబీఎస్‌నగర్‌లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు, శిశువులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా బస్తీ దవాఖానా డాక్టర్ మధుల, ఐసీడీఎస్ సీడీపీవో హాజరై గర్భిణీలు, శిశువుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రసవించిన గంటలోపు శివువుకు ముర్రు పాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.



హమాలీబస్తీ వాసులకు ఇళ్లు కేటాయించండి



జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం ఇస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ హమాలిబస్తీలో డిగ్నిటీ హౌజింగ్ స్కీంలో నిర్మించిన 65 గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని లష్కర్ జిల్లా సాధనసమితి ప్రధాన కార్యదర్శి సాదం బాల్‌రాజ్ యాదవ్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసిన లష్కర్ సాధన సమితి ప్రతినిధులు, హౌజింగ్ స్కీం లబ్ధిదారులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్‌యాదవ్ మాట్లాడుతూ సంవత్సరాల క్రితం ప్రభుత్వం సికింద్రాబాద్ హమాలీబస్తీలో డిగ్నిటీ హౌజింగ్‌స్కీం ద్వారా గృహసముదాయాలు నిర్మించిందని చెప్పారు. ఇందులో సాంకేతిక ఆకరణాలు చూపిన అధికారులు 65 మంది లబ్ధిదారులకు గృహాలు అందించలేదు. ఏళ్ల తరబడి ఇండ్లను లబ్ధిదారులకు అందించక పోవడంతో లబ్ధిదారులకు అద్దెలభారం తప్పడంలేదని, నిర్మాణం పూర్తయిన గృహాలు నిరుపయోగంగా ఉంటుండడంతో శిథిలావస్థకు చేరుతున్న విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చామన్నారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి 15 రోజులలోగా లబ్ధిదారులకు ఇండ్లు అందజేస్తామన్ హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు శైలందర్, శ్రీకాంత్ రెడ్డి, అజీజ్, హమాలిబస్తీ హౌజింగ్ స్కీం ప్రతినిధులు అంజయ్య, జమున, రవి కుమార్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల భద్రతకే మొదటి ప్రాధాన్యం

ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి



కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

సనత్‌నగర్: వాహనదారుల భద్రతే తమ మొదటి ప్రాధాన్యత అని, సురక్షిత ప్రయాణం మెరుగైన జీవితానికి దారితీస్తుందని నార్త్‌జోన్ ట్రాఫిక్ అదనపు డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. నగర ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ జోయెల్ డేవిస్, డీసీపీ రాహుల్ హెగ్డె సూచనల మేరకు బేగంపేటలోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో 'రోడ్డు ప్రమాదాలు–నివారణ' అనే అంశంపై సోమవారం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి దాదాపు 170 మంది వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి కౌన్సెలింగ్ సెషన్‌లో పాల్గొన్నారు. దీనికి హాజరైన వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ కేసుల్లో తల్లిదండ్రులు లేదా సంరక్షకులు బాధ్యత వహిస్తారన్నారు. ఆ కేసుల్లో వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సస్పెండ్ చేయబడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ఉద్యమకారుల ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

సికింద్రాబాద్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్లీనరీ సమావేశం సోమవారం సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లీనరీ సమావేశానికి ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ వీ.హన్మంతరావు, మాజీ ఎమ్మెల్సీ ఎల్.రమణ ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్నలక్ష్మి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయించేందుకు అండగా నిలుస్తామని ప్రకటించారు. పలువురు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ కాంగ్రెస్ మెనిఫెస్టోలో రూపొందించిన విధంగా ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు, పెన్షన్లను జూన్ 2వ తేదీలోగా అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలకు విస్తృతం చేస్తామన్నారు. ప్లీనరీ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు మల్లారి అనిల్, గగన్‌కుమార్, జానకిరెడ్డి, దయానంద్, పుట్నాల కృష్ణ, జగన్, వీర స్వామి పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

పంజగుట్ట: చిన్నచిన్న ప్రభుత్వ పనులు చేసే కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని నేషనల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం కాంట్రాక్టులన్నీ బడా కాంట్రాక్ట్ సంస్థలకే ఇస్తున్నారని అలా కాకుండా వర్క్ డివైడ్ చేసి చిన్న కాంట్రాక్టర్లకు కూడా పనులు ఇవ్వాలని కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చిన్నచిన్న కాంట్రాక్టర్లకు సుమారు 14 వేల కోట్ల పెండింగ్ బిల్స్ ఉన్నాయని గత రెండు సంవత్సరాల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందుల గురవుతున్నారన్నారు.

నల్లా కనెక్షన్లకు మోటార్లు బిగిస్తే చర్యలు తప్పవు



అధికారులు స్వాధీనం చేసుకున్న విద్యుత్ మోటార్లు

సికింద్రాబాద్: తాగునీటి నల్లా కనెక్షన్ దారులు మోటార్లను బిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జలమండలి తార్నాక డీజీఎం ఎస్ఎల్ సరిత హెచ్చరించారు. సోమవారం మెట్టుగూడ ఆలుగడ్డబావి ప్రాంతంలో వ్యక్తిగత నల్లా కనెక్షన్ దారుల గృహాల్లో తనిఖీలు నిర్వహించారు. నల్లా కనెక్షన్లకు బిగించిన 11 విద్యుత్ మోటార్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం డీజీఎం సరిత మాట్లాడుతూ అక్రమ నల్లా కనెక్షన్ కలిగిఉన్న వారిపై, విద్యుత్ మోటార్లు బిగించిన వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు, జరిమానాలు విధిస్తామని చెప్పారు.

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

లిబర్టీ: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.ప్రీతంసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిత్యం సేవలందిస్తూ మహానగరాన్ని పరిశుభ్రంగా పచ్చదనంగా ఉంచడంలో మున్సిపల్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లలో అనేక ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చాలీచాలని జీతాలతో ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నారన్నారు. ప్రధానంగా హైదరాబాద్ మహానగరంలో వేలాది మంది కార్మికులు మహానగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం పాటుపడుతున్నారన్నారు. ఈ సమావేశంలో దిలీప్‌సింగ్, మధు తదితరులు పాల్గొన్నారు.

కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోండి

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్ తలపెట్టిన చలో వరంగల్ సభకు సంబంధించి గోడలపై రాతలను కొందరు దురుద్దేశంతో చెరిపేసి ఆ స్థానంలో బీఆర్‌ఎస్‌ను కించపరిచే విధంగా రాసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇలా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ సైబర్ క్రైమ్స్ ఏసీపీ శివమూర్తి కుమార్‌కు సోమవారం ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. తాము గోడలపై రాసిన రాతలను మార్ఫింగ్ చేసి వాటి స్థానంలో ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి ఆమె ఫొటో ఉన్న స్థానంలో లిక్కర్‌స్కామ్ అని... మరికొందరి ఫొటోల స్థానంలో ధరణి స్కామ్, ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం స్కామ్, గులాబీ దొంగలు.. ఇదే మా చరిత్ర అంటూ రాశారన్నారు. ఈ రాతల వల్ల బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయని మార్ఫింగ్ చేసిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పోస్టులను వెంటనే తొలగించాలని వారు కోరారు.